



రాధ అద్దంముందు నిలబడి, పౌడరు అద్దుకొని తిలకం దిద్దుకుంటున్నంత సేపూ వాలు కుర్చీలో కూర్చుని కన్నార్ప కుండా చూస్తున్నాడు మాధవ్. స్త్రీ ప్రత్యేక భంగిమలో నిలబడి, తమాషాగా చేయెత్తి తిలకం దిద్దుకోడం— చూడడానికి నిజంగా ఒక అద్భుత విన్యాసం! అందులోనూ, పాలరాతి బొమ్మలాంటి రాధ ఆ పని చేస్తోంటే— ముగ్ధుడై చూస్తున్న మాధవ్- తను ఒక చిత్రకారుడు కానందుకు విచారించాడు.

కాని- అనవసర శ్రద్ధతో ఆమె ముస్తాబవుతున్నట్టు తోచిందతనికి హఠాత్తుగా. అంతే. మొగం గాంభీర్యాన్ని దాల్చి, చూపు తీక్షణం అయింది. తిలకం దిద్దుకొని మందహాసవదనంతో

వెనుదిరిగిన రాధ- భర్త మొగాన్ని చూసి మొగం ముడుచుకుంది!

"వెళ్ళి వస్తానండీ!" అంది నెమ్మదిగా.

"రాణీగారు యివాళైనా పెందలాడే వేంచేస్తారా?" - స్వరంలో హేళన! ఆమె హృదయం చివుక్కుమంది. ఆమె ఎప్పుడూ ఆలస్యం చేయదు. నిన్ననే సిటీబస్సు లేక ఆలస్యం అయింది. అంతమాత్రానికే అంత హేళనా? బాధను అణచుకొని మహిళా మండలికి వెళ్ళకుండా ఆఫీసు కాగానే యింటికి వచ్చేస్తా. సరేనా?" నిర్జీవంగా నవ్వి, చెప్పుల్లో కాళ్ళు పెట్టింది.

"ఇంకా తొమ్మిది కాలేదు. అంత తొందరెందుకో?" మరొక బాణం!

"అది కాదండీ.... కొత్త ఆఫీసరు.... ఆలస్యం అయితే చాల అవమానంగా ఉంటోంది...."

"ఓహో.... ఆఫీసరుకి కాకా పడుతున్నావన్నమాట!.... ఉత్తుత్తి కాకాయేనా?.... లేక...." మాధవ్ నవ్వేసినా, ఆ మాట గుండెల్ని దూసుకపోయి, కళ్ళు చివ్వున నిండాయి రాధకు.

"సరే.... నేను ఉద్యోగం మానేసి ఇరవై నాలుగ్గంటలూ మీకెదురుగా కూచుంటా.... ఇద్దరం ఒకేసారి.... ఒకేసారి...." ఆమె కంఠం రుద్ధమైంది. ఆవేశం చల్లారి, అర్ధోక్తిలో ఆగిపోయింది.

"ఒకేసారి చద్దాం అంటావ్! నా ఉద్యోగం పోవడంవల్ల కాదూ నీకింత లోకువ అయ్యాను? ఉద్యోగం ఎందుకు పోయింది?.... నీవల్ల కాదూ?...." రోషంగా అడిగాడు మాధవ్.

"ఆఁ.... నేనే.... లంచాలు మరిగి దొరికిపొమ్మన్నా!" ఆమె ఆవేశం మళ్లా బుస్సుమంది.

"నేనెందుకు లంచాలు మరిగాను? నీకోసం కాదూ? నీ సుఖ సంతోషాల కోసం కాదూ!" ఉక్రోషంగా అడిగాడు మాధవ్.

"నేను కష్టపడిపోతున్నానని ఎప్పుడైనా చెప్పానా? మీ జీతంతో వున్నంతలో హాయిగానే గడిపాం.... మీకే ఆ హాయి సరిపోక, విలాసాలు కావలసివచ్చి లంచాలు మరిగారు...."

ఎప్పుడూ లేనిది ఆమె మాటకు మాట బదులు చేప్పేసరికి అతని కోపం పెరిగింది. "ఛీ.... మా వాళ్ళందర్నీ దూరం చేసుకుని నిన్ను కట్టుకున్నందుకు బాగా బుద్ధి చెప్పావ్!.... బోడి ఉద్యోగం ఒకటి వెలగబెడుతున్నందుకు గర్వం!"

ఆమెలోనూ సహనం చచ్చింది. "నేను మాత్రం మావాళ్లందర్నీ వొదులుకోలేదూ!" అడిగింది.

"ఏం కూసావ్?"

మహోగ్రంగా కుర్చీనుండి లేచి, చేయి ఎత్తిన మాధవ్ — గుమ్మంలో సంశయిస్తూ నిలచివున్న వ్యక్తిని చూచి చేయి దించేసాడు. రాధ అటు చూచింది.

రామం! అన్నయ్య!! ఎన్నాళ్ళకు! ఎన్నేళ్ళకు! ముగ్గురూ ఓ క్షణం అలానే వుండిపోయారు. ముందుగా తేరుకున్న రాధ "రా! అన్నయ్యా! రా! దారితప్పి నట్టున్నావ్! అమ్మా, నాన్నా అంతా బాగున్నారా? అన్నట్టు నీకు పెళ్ళి అయిందట కాదూ? మల్లి బి. యే. పాసైందా? ఏమైనా సంబంధాలు చూస్తు న్నారా?.... ఏమండీ, అలా చూస్తున్నా రేమండీ? వీడు మా రామం అన్నయ్య!.... మరిచిపోయారా? .... అరెరె....ఆఫీసు టైమ్ మించిపోయింది.... ఒరే అన్నయ్యా యిలా వెళ్ళి అలా సెలవు పడేసి వస్తా.... ఇంట్లోనే వుండు.... పారిపోకు.... ఇద్దరూ కబుర్లు చెప్పు కుంటూ ఉండండి.... వస్తానండీ.... వస్తానురా...." యంత్రంలా గబగబ మాటలాడి, రాకెట్ లా దూసుకుపోయింది రాధ.

* * *

రామం, మాధవ్ మొగాలు చూసు కున్నారు. తర్వాత గోడలకు వేలాడు తున్న కేలెండర్లూ, ఫోటోలు చూసు కున్నారు. తర్వాత రామం వంటగదికేసి చూస్తే, వీధి గుమ్మంకేసి చూసాడు మాధవ్. అటుతర్వాత దృష్టిమరల్చుతూ ఉండగా చూపులు కలిసి, నవ్వుకొని, మాటలు కలిపారు యిద్దరూ!

సంపన్న కుటుంబంలో అల్లారు ముద్దుగా— బి యస్సీ చదువుతూన్నా.... అద్దాలలో బిడ్డలా పెరిగింది రాధ. తమ కున్నంత ఆస్తిలేకపోయినా, అందగాడూ సౌజన్యవంతుడూ ముఖ్యంగా రామం ప్రాణస్నేహితుడూ అయిన రఘు మీద శివప్రసాద్‌గారి దృష్టి పడింది. రాధ కాదనదు— అన్న నమ్మకంతోనే వాళ్ళని చూపులకు రమ్మని ఆహ్వానిస్తే వాళ్ళు వచ్చి హోటల్‌లో బసచేసారు. చూపుల విషయం చివరిక్షణంలో తెలిసిన రాధ.... వద్దుగాక వద్దని మొండికెత్తింది. నిర్ఘాంతపోయారు తలిదండ్రులు. తమ ముద్దుల కూతురు— నోట్లో వేలు పెడితే కొరకలేని— రాధయేనా! అని ఆశ్చర్య పోయారు.

"పోనీ, పెళ్ళిచూపులకు కూచో రాధా! తరువాత నచ్చలేదని రాసేద్దాం." పరిష్కారం సూచించాడు రామం. వీల్లేదంది రాధ.

"వచ్చినవాళ్ళకు యిప్పుడేం చెప్పాలి? ఏ మొగంతో చెప్పాలి?" కుమిలి పోయారు శివప్రసాద్. రామం ఖిన్న వదనంతో హోటల్‌లో స్నేహితుని చేయి పట్టుకున్నాడు. రఘు బాధపడినా చేసేదేం వుంది?

అంతే. ఇంట్లో ప్రచ్ఛన్న యుద్ధం ప్రారంభం అయింది. తండ్రి కూతురుతో మాట్లాడ్డం మానేసాడు. వీలైనప్పుడల్లా తల్లి హితబోధ చేసేది. ప్రేమ సంగతి మీకేం తెలుసు— అన్నట్టు చూసేది రాధ. అయినా తెగేవరకూ లాగడానికే

సిద్ధపడ్డ ఆమె బంధాల్ని తెంచుకొని, కొత్త బంధం ఏర్పరచుకుంది మాధవ్‌తో. తమ పెద్దరికాలకు తగిలిన షాక్‌నుండి- నాలుగేళ్ళయినా- యింకా కోలుకోలేదు తలిదండ్రులు. వ్యాపారాన్ని రామానికి అప్పజెప్పినా, "రామా, కృష్ణా" అనుకోడానికి బదులు "రాధా. రాధా" అని కుమిలిపోతున్నాడు శివప్రసాద్, యిప్పటికీ.

రామంమాత్రం రాధ ఆచూకీ తెలుసుకుంటూనే వున్నాడు. బావ ఉద్యోగం ఊడడం, అదృష్టవశాత్తు అప్పుడే రాధ కుద్యోగం దొరకడం- అన్నీ తెలిసాయి. తమ కంపెనీలోబావకుదోగ్యం యివ్వడానికి రామం సిద్ధంగానే వున్నా- తన కింద పనిచేయడానికి అతడు అంగీకరించడనీ, తండ్రి మరింత బాధపడతాడనీ- ఊరుకున్నాడు, యింతకాలం. 'పోనీ చెల్లి కాపురం చూద్దామని' బయలుదేరాడిప్పుడు; పరిస్థితి స్వయంగా చూచి కావలసిన సాయం చేద్దామని.

ఇంట్లో అడుగుపెడుతూనే చూసిన దృశ్యం రామాన్ని కలచివేసినా, రామం, మాధవ్ క్షణంలో ఆత్మీయులైనారు. రాధ వెళ్ళిపోయిన తరువాత తమ యింటి పరిస్థితిని రామం చెప్పగా, తమ సంసారం గురించి మాధవ్ చెప్పుతున్నాడు. కాసేపు కబుర్లు చెప్పి ఒక స్నేహితుని కలుసుకొని యిప్పుడే వస్తానని-రామం లేచాడు.

* * *

సిటీబస్సు కోసం నిరీక్షిస్తున్న రాధలో అంతులేని ఆలోచనలు! రామం రాక ఆమెకు అమితానందాన్నిచ్చినా, తమ సంసారంలో కలతలు రేగుతున్న ఈ తరుణంలో అతని రాక బాధ కలిగించింది. "ఈ స్వర్గం కోసమేనా- అల్లారుముద్దుగా పెంచిన తలిదండ్రులను విడిచి వచ్చేసావ్?" అని వాడు దెప్పిపొడిస్తే- తనవద్ద సమాధానం లేదిప్పుడు. ఒక సంవత్సరం క్రితం అయితే తను సగర్వంగా సమాధానం చెప్పగలిగి ఉండేది.

కాని యిప్పుడు.... యిప్పుడు....

భార్య సంపాదనమీద బ్రతకవలసి వచ్చినందుకు కాబోలు మాధవ్‌లో మార్పు వచ్చింది. భార్యపట్ల అసూయనీ, అనుమానాన్నీ పెంచుకుంటూ ఉత్తి పుణ్యానికి కొడుతున్నాడామెను! కొట్టి, పశ్చాత్తాపపడి కన్నీళ్ళు కార్చుతాడు. రాధ అతని పరిస్థితిని సహృదయతతో అర్థంచేసుకున్నది కాబట్టి తనే సర్దుకుపోతున్నది....

అరగంట దాటినా బస్సు జాడలేదు. ఆలస్యం అవుతున్నకొద్దీ ఆందోళన! విసుగ్గా వాచీ చూసుకుంటోంది రాధ. స్కూటరు ఆగిన శబ్దం. తల ఎత్తి చూచింది. ఆఫీసరుగారు!

వెనుకనుండి కోమలి దిగుతూ, రాధను చూచి "అరే, మీరా?! ఆఫీసుకు వెళ్తున్నారా? వారికి పరిచయం చేస్తా

నుండండి.... అయ్యో నా మతి మండ! మీరు వారి ఆఫీసులోనే పనిచేస్తున్నారు కదూ!...." ధారాళంగా మాట్లాడేస్తున్న దామె. చుట్టూ వున్నవారు నవ్వుకుంటు న్నారు. ఆఫీసరుగారు కళ్ళతోనే సంజ్ఞ చేసారు. అప్పటికిగాని ఆమెకు స్పృహ కలగలేదు! టక్కున ఊరుకుంది.ఆయన సత్రున ఆఫీసుకి దూసుకుపోయాడు. సెలవుచీటీ అక్కడే ఆయనకివ్వడం మర్యాదగా ఉండదని సంశయించిన రాధ తీరా ఆయన వెళ్లిపోయాక విచా రించింది.

"షాపింగ్‌కి వెళ్తున్నా. వస్తారా?.... అయ్యో నా మతి మండా! మీరు ఆఫీసుకి వెళ్తున్నారు కదా.... ఓసారి యింటికి రండి. ఎంత తన్నుకున్నా ఆ బ్యాగ్ అల్లిక పూర్తికాలేదు.... వస్తారుగా?" ఇంచుమించు అరుస్తూ ఆమె షాపుల వైపు బయలుదేరింది. ఆమె వెళ్ళగానే అంతా గొల్లున నవ్వేసారు! ఆమె వదిలి పెట్టినందుకు "అమ్మయ్య!" అనుకుంది రాధ.

* * *

సెలవు పెట్టేసి బస్సులో తిరిగి వస్తున్న రాధకు ఎదురుగా వస్తున్న బస్సులో ఎక్కడికో వెళ్తున్న రామం చటుక్కున కనిపించాడు. అవునా, కాదా అని పరిశీలించే లోగా బస్సులు దూరం అయాయి.

అన్నయ్యే! ఎక్కడికి వెళ్తున్నాడో మరి!


ఇక ఆమెకు యింటికి వెళ్ళబుద్ధి కాలేదు. మరి యిప్పుడు ఎక్కడికి వెళ్లాలి? ఏం చేయాలి?

రమ్మంది కాబట్టి కోమలి యింటికి వెళ్తే!

రాధ ఆలోచనలు కోమలివైపు మరలాయి....

ఆ ఊళ్ళో ఒక మహిళా మండలి ఉన్నది. ధనికుల కాలక్షేపం కోసమేకాదు అనాధ స్త్రీలెంతమందినో ఆ మండలి ఆదుకుంటున్నది. కుట్లూ అల్లికలూ నేర్పడమేకాదు సభ్యులు చేసిన వస్తువుల్ని షాపుల్లో అమ్మించడం, షాపుల వారికి కావలసిన పద్ధతిలో రెడీమేడ్ దుస్తులు సభ్యులచే కుట్టించడం, బ్యాగ్సు అల్లించడం_ వచ్చిన ప్రతిఫలాన్ని ఆయా సభ్యులకు అందజేయడంలాంటి మంచిపనులు కూడా చేస్తూ వుండడం వల్ల ఆ మండలికి ఊళ్ళో మంచి గుర్తింపు వుంది. అందుకే రాధ దానిలో చేరింది. మొదట్లో నేర్చుకోడానికి, కాని యిప్పుడు కొత్త సభ్యులకు రోజూ ఒక గంట నేర్పి ప్రతిఫలంగా నెలకు 15 రూపాయలు సంపాదిస్తోంది. మొదట్లో షాపులవారికి అల్లిపెట్టి 'కూలి' తీసు కోడానికి అభిమానం అడ్డువచ్చినా క్రమంగా అలవాటు అయింది.

కోమలితో పరిచయం మహిళా మండలిలో కలిగింది. ఆమెను చూసి అనాధస్త్రీ అనుకున్నారంతా! కొత్తగా




వచ్చిన ఆఫీసరు భార్యగా పరిచయం చేసుకున్నా చాలమంది నమ్మలేదు. ఆమెలో ఏదో వికర్షణ ఉంది. ఎందుకనో చాలమంది ఆమెకు దూరంగా పోతారు. కొందరు ఎదురుగా మర్యాదగా మాట్లాడినా, చాటుగా హేళనచేస్తారు. పేరులోనే తప్ప ఆమెలో కోమలత్వం ఏ కోశానా లేదు. పెద్దగా మాట్లాడుతుంది, పరిసరాలు గమనించకుండా. అనవసరంగా నవ్వుతుంది. ఆ నవ్వు వెగటుగా ఉంటుంది. చదువుకున్నా, అలా కనిపించదు. మరి అలాంటి స్త్రీకి ఎలా పెళ్లి అయిందని అందరికీ ఆశ్చర్యమే. అదీ- పెద్ద ఆఫీసరుతో. ఘనంగా కట్నం. ముట్టజెప్పి ఉంటారు.

అలాంటి కోమలి తిన్నగా వచ్చి రాధతో స్నేహం పెంచుకుంది. అందుకు మిగిలినవాళ్ళంతా రాధను వేళాకోళం పట్టించేవారు. కొద్దికాలంగా రాధ మనసుని ఒక ఆలోచన దొలిచివేస్తున్నది. తన సంపాదనమీద బ్రతకడానికి మాధవ్ అభిమానపడుతున్నాడు కనుక తన ఉద్యోగమే అతనికి యిప్పిస్తే? బాగానే ఉంటుంది. కాని అందుకు అవకాశం ఉందో లేదో— ఆఫీసరు ఒప్పుకుంటాడో లేదో- కోమలి ద్వారా ఈ పని సాధించాలి- అని నిర్ణయించుకొని ఆమె యింటికి వెళ్లింది.

కోమలి యింట్లోనే వుంది. రాధ వచ్చినందుకు పొంగిపోయింది. ఆనందాన్ని దాచుకోడం ఆమెకు చేతగాదు. చిన్న పిల్లలా గంతులేస్తూ కబుర్లు

చేప్పేస్తూ- వద్దంటున్నా వంటగదిలో దూరింది. ఒక్క- క్షణంలో బ్రహ్మాండమైన కాఫీ తెచ్చింది. ఆఫీసరు భార్య అహం ఏ మాత్రం లేకుండా గలగల మాట్లాడేస్తున్నది. "మా యింటికి ఎవరూ రారండీ. వచ్చినా, వంకర మూతివాళ్ళూ, యిరుకు హృదయాలవాళ్ళూ వస్తారు. నేను అందకత్తెను కానని నాకు తెలుసు. నేనేం చేయను? సానుభూతి చూపనక్కర్లేదు. 'ఎలాగో పుట్టింది. పోనీ బ్రతకనియ్-' అనుకోరేం? నన్ను హేళనచేస్తూ, నా అదృష్టానికి అసూయ పడుతూ కాకుల్లా పొడుస్తారు. నన్ను వదిలేస్తే అప్సరసలాంటి అమ్మాయిని తెచ్చి కట్టబెడతాం- అని కొందరు మా వారినే ప్రలోభపెట్టారు. అప్పుడాయన వారిని బయటకు పొమ్మన్నారు।....." ఇక అక్కడనుండి ఆమె ప్రసంగం శ్రీవారి గొప్పదనం మీదకు మళ్లింది. ఆయన ఎన్నో పెళ్లిచూపులకు వెళ్లారట. ఏ అమ్మాయీ నచ్చలేదట. ఒకమ్మాయి నచ్చిందిగాని, ఆమెకు ఈయన నచ్చలేదట? ఆ మాట తెలిసి ఆయన అహం దెబ్బతిన్నది. చాల బాధపడి అలాగే తను నిరాకరించిన అమ్మాయిలు కూడ బాధపడి వుంటారని గ్రహించి, నచ్చినా నచ్చకపోయినా తరువాత చూడబోయే అమ్మాయిని చేసుకోవాలని నిర్ణయించుకున్నాడట. క్యూలో తరువాత ఉన్న అమ్మాయి కోమలి? అప్పటికే ఈ చూపుల తతంగాలతో విసుగెత్తిన కోమలి ఈ సంబంధం స్థిరపడకపోతే ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుందట.

ఆయన వివాహానికి అంగీకరించారని తెలిసి ముఖ్యంగా కోమలి అమితాశ్చర్యపోయింది. అందంలో ఆయన కాలిగోటికి పోలని ఆమె తన లోపాన్ని ప్రేమ, అనురాగం, సౌశీల్యాలతో కప్పిపుచ్చి ఆయన మెప్పును పొందుతున్నది.

భర్తల గురించి భార్యలు గొప్పలు చెప్పుకోడం సాధారణ విషయమే. కాని కోమలి స్వరంలోని అరాధనా భావం, కళ్ల కాంతి చూసి చకిత అయింది రాధ. బాగా పరిచయం పెరిగాక తన సమస్యను కోమలి ముందుంచాలని అనుకొని ఆనాటికి వైర్‌బ్యాగ్ పూర్తిచేయించి లేచింది రాధ.

* * *

రాధ మండలిలో వైర్లూ గ్రటా తీసుకొని వచ్చేటప్పటికి యింటికి తాళం వేసి ఉంది। ప్రక్క యింటామె "అన్నయ్యగారు తాళంచెవి మాకివ్వలేదు. అందాకా మా యింట్లో కూచోండి," అని నవ్వింది.

తను డూప్లికేటు 'కీ' మరిచిపోయినందుకూ, ఆయన తాళంచెవి ప్రక్కయింట్లో యివ్వనందుకూ ఆమెకు కోపం రాలేదుగాని ప్రక్కింటి ఆమె నవ్వినందుకు కోపం వచ్చి రోషంగా మెట్ల మీద కూచుంది. భర్త కోపం తగ్గలేదులా ఉంది.

ఈ జీవితం యింకా ఎంతకాలం? దుఃఖం పొంగివచ్చింది.

ఇప్పుడు అన్నయ్య వస్తే?.... ఆమె కన్నీరు ఆగలేదు! పదినిమిషాలు గడిచాక, తాళాలు చిద్విలాసంగా ఊపుకుంటూ మాధవ్ వచ్చాడు.

"అరె.... నీ 'కీ' తీసుకెళ్ళలేదా?" నవ్వుతూ తలుపు తెరిచాడు.

అంత కోపాన్నీ దిగమింగి లోనికి వెళ్ళింది రాధ.

అరగంట తర్వాత హడావుడిగా రామం వచ్చాడు. హుషారుగా భోజనాలు పూర్తిచేసాక మ్యాట్నీకి లాక్కుపోయాడు. ఇంగ్లీషు సినిమా. లవ్ స్టోరీ. కథ చిన్నదే అయినా హృదయాన్ని కదిపివేసాడు దర్శకుడు. ముఖ్యంగా ప్రేమికులు జీవితాంతమూ జ్ఞాపకం పెట్టుకోవలసిన నగ్నసత్యాన్ని చెప్పాడు రచయిత.

"లవ్ మీన్స్ నెవర్ టు హేవ్ సెడ్ యు ఆర్ సారీ."

నిజమే. ప్రేమించి పెళ్ళిచేసుకున్న మొదట్లో జీవితం గులాబీల పాన్పులా ఉంటుంది. కాలం గడుస్తున్నకొద్దీ గులాబీరేకులూడి ముళ్లు గుచ్చుకోడం ప్రారంభం అయాక పశ్చాత్తాప పడుతుంటారు చాలామంది. అలా పశ్చాత్తాపానికి దారితీసేది నిజమైన ప్రేమ కాదంటాడు రచయిత. సినిమా చూసాక తమది నిజమైన ప్రేమ కాదేమోనని పించింది రాధకు. వంటచేయాలని రాధ మొత్తుకుంటున్నా, సినిమానుండి అలా పార్కుకు లాక్కుపోయాడు రామం వాళ్లని. పైగా "మన ఆంధ్రులతో వచ్చే పేచీ అదే. ఎవరైనా వస్తే చాలు, వాళ్లతో మాట్లాడడానికికూడా తీరిక లేకుండా గృహిణి వంటగదికి అంకితమైపోతుంది. నేను ప్రోగ్రామ్స్ వేసి నడిపిస్తాగాని వంటగురించి బెంగపెట్టుకోకు" అని తియ్యగా మందలించాడు చెల్లెలిని.

హుషారుగా కబుర్లు చెప్పుకుంటున్న జంటలతో, గోలగా ఆడుకుంటున్న పిల్లలతో రంగుదీపాలతో కలకలలాడుతోంది పార్కు. చాలాకాలానికి ప్రపంచం అందంగా కనిపించింది రాధకు. మాధవ్ కూడా ఛలోక్తులు రువ్వుతూ, నవ్వుతూ నవ్విస్తున్నాడు. ఎన్నాళ్ళకు! ఎన్నాళ్ళకు మళ్లా యీ వసంతం?!

ఖరీదైన హోటల్‌లో తృప్తిగా భోజనం చేసారు. తమకోసం డబ్బు యిలా విచ్చలవిడిగా రామం ఖర్చుపెట్టడం నచ్చలేదు రాధకు. రేపటినుండి అలా వీల్లేదని నవ్వుతూనే ఆంక్ష పెట్టింది.

"జీ హుకుమ్" తల అంగీకారంగా వంచాడు రామం.

ఇంటికి వచ్చి వెన్నెల్లో కూచుని కాసేపు సోది చెప్పుకున్న తరువాత

"నాకు ప్రేమ ఒక గ్లామర్. ప్రేమ

వివాహం మరింత గ్లామర్. ప్రేమించి పెళ్ళిచేసుకునే అవకాశం నాకు కలగ లేదు అ పని నా చెల్లెలు సాధించినందుకు లోలోన గర్విస్తూ ఉంటాను. నిజానికి మా జీవితంకన్నా మీ జీవితం ఎంతో అన్యోన్యంగా— మేం ఈర్ష్యపడేంత అన్యోన్యంగా— ఉండాలి.... కాని....” యిక ఏమీ అనలేకపోయాడు రామం.

అతని స్వరంలోని నిజాయితీ మాధవ్‌ని కదిలించివేసింది. రామం చెప్ప దలచుకున్నది అర్థం అయి తలవంచు కున్నాడు మాధవ్.

తర్వాత, వణుకుతున్న స్వరంతో "సారీ బావా, నేనెందుకుకింత మూర్ఖంగా ప్రవర్తిస్తున్నానో నాకే తెలియదు," అన్నాడు.

నిజానికి ఉద్యోగం పోగానే మాధవ్ హృదయాన్ని అవమానం కప్పేసింది. భార్యకు దొరికినందుకు ముందు సంతో షించినా— తను స్త్రీలతో ఎంత చనువుగా ఉండేవాడో, వాళ్లు తనతో ఎంత ఫ్రీగా తిరిగేవారో తలచుకొని, యిప్పుడు రాధ కూడా యితరులతో ఫ్రీగా మెలగుతున్న దేమో నన్న అనుమానపు పొర ఏర్ప డింది. రాధ అలాంటిది కాదని హృదయం ఘోషిస్తున్నా, ఈ పొరలను ఛేదించుకొని ఆ నిజం బయటకు రాలేక పోతోంది. ఇప్పుడు రామం రాకతో ఆ పొరలు కరిగి, అతనిలో పశ్చాత్తాపం ప్రత్యక్షమైంది ఆమాత్రానికే రాధ హృదయంలో తొలకరిజల్లులు కురిసాయి. బాధపడకండి— అన్నట్టు భర్త చేతిని సస్నేహంగా నొక్కింది.

"నీ ఉద్యోగంకోసం తీవ్రంగా ప్రయత్నిస్తా. అంతవరకూ కాస్త ఓపిక పట్టు బావా. అసలు అందుకే ఉదయం ఒక కంపెనీకి వెళ్లాను. కానీ ఖాళీలు లేవు" అన్నాడు రామం. కాని అసలు విషయం అదికాదు. అవినీతి కారణంగా ఉద్యోగం పోగొట్టుకున్నవాడికి ఎలా యివ్వను ?— అని నిరాకరించాడు అతని స్నేహితుడు.

తేలికపడిన హృదయాలతో— చంద్రుడు మాయమయేవరకు— కబుర్లు చెప్పుకొని లేచారు, నిద్రకు.

* * *

వంటగది తలుపు సందులోంచి వస్తున్న వెలుగు రామానికి నిద్రాభంగం కలిగించింది. చిన్న చిన్న శబ్దాలు వినిపి స్తోంటే నిశ్శబ్దంగా లేచి చూసాడు.

ఆవేళప్పుడు రాధ వైర్‌బ్యాగ్ అల్లు తోంది। కూరుకు వస్తున్న నిద్రను పారద్రోలడానికి కళ్లు నులుము కుంటోంది. విశ్రాంతి కోసం అప్పు డప్పుడు వైర్లు క్రింద పెట్టేసి గోడకు చేరబడి కళ్లు మూసుకుంటోంది. నిద్ర పట్టేస్తుందన్న భయంతో మళ్లా యింత లోనే తల విదిలించి అల్లిక మొదలు పెడుతోంది. చెల్లి అంత కష్టపడడం చూడలేక ఆమె ముందుకు వెళ్లాడు రామం.

ముందు ఉలిక్కిపడి తర్వాత నవ్వ బోయింది, రాధ అన్నయ్యను చూసి.

"ఇదంతా ఏమిటి ?"

"వైర్ బ్యాగ్ !.... అల్లుతున్నా" నవ్వింది. ఆ నవ్వులోని విషాదం రామాన్ని ఘెళ్లు మనిపించింది. అతనికి ఒక విషయం స్పష్టంగా అర్థం అయింది. రేపటినుండి తను- చుట్టం హోదాలో మర్యాదలు స్వీకరించడమేగాని డబ్బు ఖర్చుపెట్టడానికి వీల్లేదన్నమాట ! బ్యాగ్ పూర్తిచేసి డబ్బు సంపాదించి తనకు మర్యాదలు జరపబోతున్న చిట్టి చెల్లెలు !

గిరుక్కున వెనుదిరిగి వెళ్ళి పడుకున్నాడు రామం.

తెల్లవారేసరికి అన్నయ్య బట్టలు సర్దుకోవడం చూసి ఆశ్చర్యపోయింది రాధ.

రాధా మాధవ్‌లు ఎంత ఒత్తిడి చేసినా అతడు ఉండలేదు. వెళుతూ, మాధవ్ ఉద్యోగం గురించి వాగ్దానం చేసాడు.

తరువాత రెండురోజులు సాఫీగా సాగినా, అటు తరువాత మాధవ్ సాధింపు ఎక్కువైంది. అదేం ఖర్మమో, ఈ మధ్య రాధను తప్పించుకు తిరుగుతున్నది సిటీబస్. ఫలితంగా రోజూ అరగంట ఆలస్యం.

"పాపం దేవిగారు ఆఫీసరుగార్ని సేవించి వస్తున్నారు కాబోలు...." విరుచుకు పడతాడు మాధవ్. ఆమె సమాధానం చెబితే తప్పు, చెప్పకపోతే ముప్పు। అన్నయ్యనుండి ఉత్తరం కోసం వేయికళ్ళతో ఎదురుచూడటమే గాని వెళ్ళిన తరువాత వ్రాయనేలేదు వాడు. అదీ రాధ తప్పే అయినట్టు ఆమెను సతాయించేవాడు మాధవ్, "మీ ధనంతుల తత్వమే యింత" అంటూ.

ఇక భరించలేక, ఆఫీసులో పెర్మిషన్ పెట్టి, ముందుగా బయలుదేరి కోమలి యింటికి వెళ్ళింది రాధ ఒకరోజు. తన సమస్యను ఆమెకు వినిపించి, తన ఉద్యోగం భర్తకు యిప్పించే ఏర్పాటు చేసి పుణ్యం కట్టుకోమని సజల నయనాలతో వేడుకొంది. కోమలి కరిగిపోయింది.

"అందంలేక నేను బాధపడుతున్నా. అందం, అణకువ, మంచితనం, పైగా ఉద్యోగం ఉండి కూడా మీరు బాధపడుతున్నారు ! స్త్రీ జీవితం ఎంత చిత్రమైనది !" అని కాసేపు వేదాంతం మాట్లాడి "ఆదివారం సాయంకాలం రండి. ఈలోగా వారితో చెబుతా" అని వాగ్దానం చేసింది కోమలి.

కొండంత ఆనందంగా మెట్లు దిగుతున్న రాధకు ఎదురుగా రోడ్డుమీద భర్త కనిపించాడు. తనను చూసి అతని కళ్లు నిప్పులు కురుస్తున్నాయి ! ఆమె గుండె ఝల్లుమంది. ముందూ వెనుకలుగా యిద్దరూ యిల్లు చేరుకున్నారు. గుండె అదుముకుంటూ లోనికి అడుగు

పెట్టింది. భయపడతూడు వంటగదిలోకి వెళ్ళి కాఫీ కలిపింది. వణికిపోతూ భర్త కిచ్చింది.

ఆశ్చర్యం! అతడేమీ అనలేదు. ఎటో చూస్తూ ఉండిపోయాడు. ఆఫీసరు గారింటికి ఎందుకు వెళ్ళినదీ- అతడు అడగకుండా చెప్పడం ఎందుకని ఊరు కొంది రాధ. చెప్పినా అతడు ఎలాగూ నమ్మడు.

కొట్టడం, తిట్టడం యిక లాభం లేదనుకున్నాడేమో, పద్ధతి మార్చి మౌన సత్యాగ్రహం మొదలుపెట్టాడు మాధవ్. శూన్యంగా వెర్రిచూపులు చూస్తూ ఉండి పోతాడు. ఉలకడు, పలకడు, పెట్టింది తినడు. అతడు తినకపోతే రాధ తినదు. రెండు పూటలా వండడం; ఎవరూ తినక బిచ్చగాడికి పెట్టడం!

రెండోరోజు అభిమానం చంపుకొని రాజీకి ప్రయత్నించింది రాధ. కాని అతనిలో మార్పులేదు. అందువల్ల వండ కుండా ఆఫీసుకి వెళ్ళిపోయిందామె. అనవసరంగా వండి బిచ్చగాళ్లకు పొయ్యడం ఎందుకని ఆమె భావం. "ఎంత పొగరు!" అతడు లోలోనే హుంకరించాడు.

ఆఫీసునుండి తిరిగివచ్చి చూస్తే మాధవ్ గడ్డం గీసుకొని ట్రిమ్‌గా ఉన్నాడు. బ్యాగ్స్ అల్లి సంపాదించిన డబ్బు అంతా ఒక డబ్బాలో ఉంచుతుం దామె. ఆ డబ్బా ఖాళీ!

ఆమెకు కోపం రాలేదు. నవ్వు వచ్చింది!

వెంటనే కాఫీ కలిపి అతనికిచ్చింది. అతడు కదలలేదు. మెదలలేదు. హోటల్‌లో భోజనంచేసి బలం పుంజు కున్నాడు కాబట్టి మరో రెండురోజులు నిరాహారదీక్ష పూనవచ్చు.

అతడెటూ భోజనంచేసి వచ్చాడు గనుక తను వండుకొని తిందామన్నంత ఆవేశం కలిగింది. కాని అభిమానం అడ్డు వచ్చింది. మండేకడుపుని నీళ్ళతో చల్లార్చుకొని ముడుచుకుని పడుకొంది. ఈ ప్రచ్ఛన్న యుద్ధం యింకా ఎంత కాలమో ఆమెకు అర్థంకాలేదు.

"ఛీ. ఏం జీవితం!" అని విలపిం చింది. తలగడ తడిసింది గాని, మాధవ విగ్రహం కరగలేదు.


ఆయన కుద్యోగం సంపాదించిపెట్టి, తరువాత అభిమానం చంపుకొని అయినా అతని కాళ్ళుపట్టుకొని రాజీపడాలని నిర్ణయించుకుంది.

* * *

చెప్పిందంతావిని "మీకు రామం తెలుసా?" ఆశ్చర్యంగా అడిగాడు ఆఫీసరు. ఈ మధ్యనే రామం- మాధవ్ ఉద్యోగంకోసం తనని కోరడం జ్ఞాపకం వచ్చి.

"రామం మా అన్నయ్య సార్."

షాక్ తిన్నట్టు చూచాడాయన. అతి ప్రయత్నంమీద గాంభీర్యాన్ని తెచ్చి




పెట్టుకొని "మీరు మా ఆఫీసులోనే పనిచేస్తున్నట్టు వాడు చెప్పలేదే!" గొణుక్కుంటున్నట్టు అన్నాడు. తరువాత వొణుకుతున్న స్వరంతో "మీకు తెలుసో, తెలియదోగాని రామం, నేనూ ప్రాణ స్నేహితులం" అన్నాడు. హఠాత్తుగా జ్ఞాపకం వచ్చింది రాధకు— "ఆఫీసర్ పేరు వి.ఆర్. నాథ్– అంటే వి. రఘునాథ్– రఘు– అన్నయ్య ప్రాణ స్నేహితుడు....!"

ఆమె మెదడు మొద్దుబారింది.

ఒకప్పుడు తను చూడ నిరాకరించిన పెద్దమనిషి ఎదుట యిప్పుడు దైన్యంగా నిలబడి— అతనిని కాదని చేసుకొన్న భర్తకి ఉద్యోగం కోసం ప్రాధేయపడవలసి రావడం!— అదీ అవినీతి కారణంగా ఉద్యోగం పోగొట్టుకున్న భర్త! అప్రయత్నంగా మొగం చాటు చేసుకొని కళ్ళు తుడుచుకొంది.

"కూచోండి.... మిసెస్....రాధా.... మాధవ్ (స్వరం వొణికింది).... మీరు భోంచేసి ఎన్నాళ్ళయింది?" హఠాత్తుగా అడిగాడు రఘు.

ఉలిక్కిపడిందామె. భార్యవైపు చూసాడు రఘు. పళ్ళూ, బిస్కెట్లూ తెచ్చి బలవంతంగా తినిపించిందామె. ఆమె ఆదరణ చూస్తున్నకొద్దీ రాధకు దుఃఖం పొంగుకువస్తున్నది. బలవంతంగా ఆపుకొని, పళ్ళు తిని కాస్త స్థిమితపడింది.

"మిసెస్ రాధా, మీరు రామం చెల్లెలని యింతవరకూ తెలియకపోయినా మీ విషయాలు నాకు కొన్ని తెలుసు. పరిచయం లేకపోయినా, మాధవ్‌ని నేను చూశాను. ఎందుకో అతనికి మీ మీద అనుమానం. ప్యూన్‌ని మంచి చేసుకొని మీ ప్రవర్తన గురించి ఆరా తీస్తూవుంటాడు. ఇదంతా గమనించి....

నేను కూడా.... మీ శీలాన్ని శంకించాను మొదట. కాని.... మాధవ్ దంతా జెలసీ అని గ్రహించాను.... ప్రేమ వివాహం కదా మీది! అమాత్రం జెలసీ ఉండడం న్యాయమే...." నవ్వబోయాడు రఘు.

మాధవ్ తనమీద నిఘా వేసినట్టు మొదటిసారిగా విన్న రాధ నిర్ఘాంత పోయింది. అవమాన భారంతో యిక తల ఎత్తుకోలేకపోయింది.

"మీ ఉద్యోగం అతనికివ్వడం అవదు. ఒకవేళ యిచ్చినా, అతని అనుమానం మరింతఎక్కువ అవుతుంది. మరింత యాతన. మరిన్ని సమస్యలు. అప్పుడు కావాలంటే మళ్ళీ మీకు ఉద్యోగం దొరక్కపోవచ్చు. ఈ పరిస్థితిలో వున్న ఉద్యోగాన్ని మీరు ఒదులుకోడం మంచిదికాదు..."

రఘు సలహా బాగున్నట్టే తోచి లేచింది, రాధ.

* * *

"ఎక్కడికెళ్ళావ్?" గర్జించాడు మాధవ్. సమాధానం లేదు.

"ఆ రఘు యింటినుండేకదూ? ఎన్నాళనుండి సాగుతోంది నాటకం?"

ఆమె తీవ్రంగా చూచింది. మళ్ళా అంతలోనే సర్దుకొని సౌమ్యంగా తను ఎందుకు వెళ్ళినదీ చెప్పింది.

"మరి నాకు ఉద్యోగం యిస్తాడా?" తల వంచుకుందామె.

"ఔనులే. నాకు ఉద్యోగం యిస్తే మీ నాటకాలెలా సాగుతాయి?.... అంత మోజున్నదానివి వాణ్ణే పెళ్ళాడలేక పోయావా?" రెచ్చిపోయాడు.

"ఏమండీ!" అరిచింది రాధ.

"ఎందుకలా రంకె లేస్తావ్? నీ రంకులన్నీ బయటపడ్డాయనా? రఘు ఎవరో, మీ అన్న ఎందుకొచ్చాడో, వాణ్ణి ఎందుకు కలుసుకున్నాడో నాకు తెలియదనుకున్నావా? మీరందరూ కలిసి నన్నో చవటను చేసారు. నీ సంపాదన మీద బ్రతుకుతున్నానని కదూ నీకా పొగరు? ఛీ. నా వాళ్ళందర్నీ వొదులుకొని వచ్చినందుకు భలేగా బుద్ధిచెప్పావ్! నేను.... నేను.... నిన్నొదిలి మావాళ్ళ వద్దకు పోతేగాని నీకు బుద్ధిరాదు."

శరాల్లా మాటలు వొదులుతున్నాడు మాధవ్.

ఇలాంటి బాణాలు గుచ్చుకొని గుచ్చుకొని ఆమె హృదయం మొద్దుబారింది. ఈ మాటలామెను బాధించలేక పోయాయి. రేడియోలో నాటిక వింటున్నట్టు ఉండిపోయింది.

తాను ఆశించిన భయం ఆమెలో కనిపించకపోయేసరికి ఆశ్చర్యపోయాడు మాధవ్. "వింటున్నావా! నిన్నొదిలి పోతున్నా" రెట్టించాడు' కసిగా.

అయినా ఆమె సమాధానం చెప్పలేదు. చీర మార్చుకొని వంటగదిలోనికి వెళ్ళింది. తన మాట ఖాతరుచేయకుండా తన వునికినే గుర్తించకుండా ఆమె



వెళ్ళిపోడం—అతని పురుషత్వానికే సవాలులా తోచింది. వెనుకనే వెళ్ళి పిచ్చికోపంతో ఆమె జడను ఎడమ చేతితో దొరకబుచ్చుకొని గుంజుతూ "ఎంత పొగరే నీకు?—భర్తకు సమాధానం చెప్పడానికి నోరు కొవ్వెక్కిందా?" చెంప ఛెళ్ళుమనిపించాడు.

"జడ వదలండి" అపర చండిలా గర్జించిందామె. అప్రయత్నంగా వొదిలేసాడు మాధవ్. కళ్ళు మూసుకొని అతి ప్రయత్నంగా ఆవేశాన్ని అణచుకుంటున్నదామె. ఆ రోషనారీ అవతారాన్ని చూడగానే మాధవ్ గుండె ఝల్లుమన్నది.

ఉత్తుంగ తరంగంలా ఎగసిపడుతున్న ఆమె ఎద క్రమంగా శాంతించి, మొగంలోని భగభగలూ, కళ్ళలోని సెగలూ చల్లారేవరకూ ఆగింది. తరువాత, సర్వం కోల్పోయినా అభిజాత్యాన్ని కోల్పోని మహారాణిలా "బెదిరించడానికే అంటున్నారో, నిజంగానే అంటున్నారో నాకైతే తెలియదు. కాని మనం ప్రేమించుకున్నాం. పెళ్ళి చేసుకున్నాం. కష్టాలూ, సుఖాలూ కలబోసి పంచుకుందామనీ; ఏ అవాంతరం వచ్చినా, నాకు మీరూ, మీకు నేనూ బాసటగా నిలవాలనీ నిర్ణయించుకున్నాం. మరి యిప్పుడేమయింది? మీరు సంపాదించి

నప్పుడు హాయిగా వుండి యిప్పుడుండ లేకపోతున్నామేమి? ఎక్కడుంది లోపం? మీలోనా? నాలోనా? నేను అహంకరించి మిమ్మల్ని అవమానిస్తు న్నట్టు మీ నోరు అన్నా, మీ మనసు అనలేదని నాకు తెలుసు. మరి నన్నెందుకు హింసిస్తున్నారు? అందర్నీ వదులుకొని యిద్దరమూ వచ్చేశాము. మీరు వెనక్కి వెళ్ళగలరేమో గాని నేను వెళ్ళలేను. వెళ్ళను. నా మీద నిఘావేసి కూడా మీరు నన్నే కాదు మీ కళ్ళనూ, మనసును కూడా నమ్మలేక పోతున్నారంటే— మిమ్మల్ని ప్రేమించి ఎంత మోసపోయానో యిప్పుడిప్పుడే తెలుస్తోంది నాకు. పై మెరుగులు చూసి కళ్ళు మూసుకుపోయి — ప్రేమించు కున్నాం అనుకుంటూ గోతిలో పడే లక్షలాది అభాగినులకు ఒక ప్రతీకగా— నే నిక్కడే ఒంటరిగా వుంటాను. ఒదిలేస్తా—అని బెదిరిస్తూ బ్లాక్ మెయిల్ చేసి భార్యలను లొంగదీసుకోడానికి ప్రయత్నించే మీలాటి వాళ్ళకు— స్త్రీ ఒంటరిగావున్నా గౌరవంగా జీవించ గలదని నిరూపిస్తా. అందంగా వున్న ప్రతి అల్లాటప్పకు ప్రేమించే హక్కు లేదనీ— కష్టాల్ని దృఢచిత్తంతో ఎదుర్కొంటూ, తనను నమ్ముకొని వచ్చిన స్త్రీకి చేయూతనిచ్చే సహృదయు నికే ప్రేమించే హక్కు ఉందని చాటి చెప్పడానికైనా నేను జీవించే వుంటాను. ఇక మీరు వెళ్ళినా మానినా మీ యిష్టం."

ఇక చెప్పడానికేమీ లేనట్టు ఆమె వెనుదిరిగి స్టౌ వెలిగిచింది. చూస్తూ ఉండగానే తను అందుకోలేని ఎత్తులకు రాధ ఎదిగిపోయినట్టు గుర్తించాడు మాధవ్. ఆ ఔన్నత్యాన్నీ, వ్యక్తిత్వాన్నీ భరించేపాటి స్థైర్యం తనలో లేనట్టూ గుర్తించాడు. కాసేపు తటపటాయించి భారంగా కదిలాడు. ఆమె వారించలేదు. స్టౌ మంటని తదేకంగా చూస్తూ ఎంత సేపు ఉండిపోయిందో!

"టెలిగ్రాం!"

చించి చదివింది. అతి ప్రయత్నం మీద మాధవ్‌కు ఏదో కంపెనీలో ఉద్యోగం ఏర్పాటు చేసినట్టూ, వెంటనే జాయిన్ అవమంటూ రామం యిచ్చిన టెలిగ్రాం!

ఇది మాధవ్ ఉండగా వస్తే....

పరుగెత్తుకు వెళ్ళి ఆయన్నే లాక్కు వద్దామన్న ఉద్వేగం కలిగిందామెలో. హృదయం కాసేపు ఊగిసలాడింది.... అంతే. దీర్ఘంగా నిట్టూర్చి టెలిగ్రాంను స్టౌమీద పడేసింది!

———